అదనపు ఏజీగా రజనీకాంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): హైకోర్టులో అదనపు అడ్వకేట్ జనరల్‌గా తేరా రజనీకాంత్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి ఆర్ తిరుపతి పేరిట గురువారం జీవో జారీ అయ్యింది. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆ ఉత్తర్వులు అమల్లోకి రానున్నాయి.

ఇంటి నుంచే పోస్టల్ సేవలు

- **అందుబాటులోకి 'క్లిక్ ఎన్ బుక్' సేవలు**

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఇంటి నుంచే సేవలు పొందేలా పోస్టల్ శాఖ 'క్లిక్ ఎన్ బుక్'ను అందుబాటులోకి తెచ్చింది. భారతీయ తపాలా శాఖ లేటెస్ట్ టెక్నాలజీ ఉపయోగించి, కస్టమర్ ఫ్రెండ్లీగా హైటెక్ సర్వీసులను అందించేందుకు ప్రయత్నం చేస్తున్నది. అందులో భాగంగానే ఈ సేవలను విస్తృతం చేయాలని చూస్తున్నది. ఈ సేవలు హైదరాబాద్ నగరంలో ప్రారంభమైనట్టు చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఎన్ఎస్ఎన్ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కస్టమర్లు ఇంటి గుమ్మం నుంచే స్పీడ్ పోస్టు (డాక్యుమెంట్లు, ఇతర పార్శిల్స్), రిజిస్టర్డ్ లెటర్లు, పార్శిళ్లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని సూచించారు. బుక్ చేసిన సరుకులను పోస్టుమాన్‌తో అందజేస్తారని చెప్పారు. ఇందులో ఐదు కిలోల వరకు బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 107 పిన్‌కోడ్‌తో అందుబాటులో ఉన్నదని చెప్పారు. టారిఫ్ గరిష్ఠంగా రూ.500, కనిష్ఠంగా రూ.50 ఉంటుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న రోజు, లేదా మరుసటి రోజు ఆయా వస్తువులను అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, వివరాలకు www.indiapost.gov.inలో సంప్రదించవచ్చని సూచించారు.

సాగర్ ఆయకట్టుకు క్రాప్ హాలిడే?

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ఏడాది కృష్ణానది పరీవాహక ప్రాంతంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురువకపోవడం, ఎగువ నుంచి వరదలు రాకపోవడంతో నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వాయర్లు వెలవెలబోతున్నాయి. నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటినిల్వ మట్టం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 157.61 టీఎంసీలే అందుబాటులో ఉన్నాయి. అందులో 105.70 టీఎంసీలను తెలంగాణ వాటాగా కేటాయించారు. వీటిని తాగునీటి అవసరాలకు వినియోగించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆశించిన స్థాయిలో నీటినిల్వలు లేకపోవడంతో సాగర్ ఎడమ కాలువ కింద ఆయకట్టుకు యాసంగి సీజన్‌లో సాగునీరు ఇవ్వలేమని అధికార యంత్రాంగం తేల్చింది. ఎడమ కాలువ కింద మొత్తంగా 6.40 లక్షల ఎకరాలు ఉండగా, ఈ యాసంగిలో ఒక్క ఎకరాకు కూడా నీరు ఇచ్చే పరిస్థితి లేదు. శ్రీశైలం ప్రాజెక్టులో 57 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు యాసంగి సీజన్‌లో సాగునీరివ్వలేని పరిస్థితి నెలకొన్నది. నెట్టెంపాడు కింద 5 వేల ఎకరాలకు, మూసీ ప్రాజెక్టు కింద 30 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరివ్వాలని అధికారులు ప్రతిపాదించారు. కృష్ణా బేసిన్ వెలవెలబోతున్నప్పటికీ, గోదావరి బేసిన్‌లోని భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతుండటం కాస్తంత ఊరట. ఈ నేపథ్యంలో ఆయా ప్రాజెక్టుల్లోని ప్రస్తుత నీటి నిల్వలు, ఆయకట్టు విస్తీర్ణం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ఏ ప్రాజెక్టు కింద ఎన్ని లక్షల ఎకరాలకు ఈ యాసంగిలో సాగునీరు అందించాలనే దానిపై రాష్ట్రస్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ (ఎస్‌సీఐఈఏఎం) తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సదరు ప్రతిపాదనలపై టెరిటోరియల్ వారీగా చీఫ్ ఇంజినీర్లతో ఈఎన్‌సీ మురళీధర్ బుధవారం చర్చించారు. ప్రాజెక్టుల వారీగా నీటి నిల్వలను పరిగణనలోకి తీసుకుని యాసంగిలో ఎంత ఆయకట్టుకు నీరివ్వడం సాధ్యమో లెక్కతేల్చారు. 2023-24 యాసంగిలో మొత్తంగా 28.95 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీటిని ఇవ్వాలని నిర్ణయించారు.

నాగార్జునసాగర్‌లో నీటి నిల్వ (ఫైల్)

ఎస్సారెస్పీ-1,2 కింద 11.55 లక్షల ఎకరాలకు..

యాసంగి సీజన్‌లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద దాదాపు 11.55 లక్షల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని సాగునీటి పారుదలశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఎస్సారెస్పీ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 78.66 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నది. ఇందులో 6.50 టీఎంసీలు తాగునీటి అవసరాలకు, మిగతా నీటిని సాగునీటి అవసరాలకు వినియోగించనున్నారు. ఈ నేపథ్యంలో ఎస్సారెస్పీ స్టేజ్-1 కింద మొత్తంగా 9,65,013 ఎకరాలు ఉండగా, అందులో 8,28,297 ఎకరాలకు మాత్రమే సాగునీరు ఇవ్వాలని నిర్ణయించింది. అందులో 3.87 లక్షల ఎకరాలకు ఆరుతడి పంటలకు, 4.41 లక్షల ఎకరాలకు తరి పంటలకు సాగునీరు ఇవ్వాలని ప్రతిపాదించింది. ఇదిలా ఉండగా గత యాసంగి సీజన్‌లో స్టేజ్-1 కింద ఉన్న మొత్తం 9,68,640 ఆయకట్టుకు 9,60,000 ఎకరాలకు సాగునీరు అందించారు.

8 లక్షల ఎకరాల్లో యాసంగి సాగు

- **గతంతో పోల్చితే భారీగా పెరిగిన వరి సేద్యం**

హైదరాబాద్, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ): యాసంగి సీజన్ పంటల సాగు జోరుగా సాగుతున్నది. వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం.. బుధవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 7.97 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. గత సీజన్‌లో ఇదే సమయానికి 7.69 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. గతంతో పోల్చితే ఈ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం భారీగా పెరుగుతున్నది. గతంలో ఈ సమయానికి 12 వేల ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పడగా ఈ సీజన్‌లో ఇప్పటికే 76 వేల ఎకరాలకు పైగా వరి సాగైంది. మక్కజొన్న కూడా ఎక్కువగానే సాగవుతున్నది. నిరుడు ఇదే సమయానికి 1.64 లక్షల ఎకరాల్లో మక్కజొన్న సాగు కాగా ప్రస్తుతం 2.02 లక్షల ఎకరాలకు పెరిగింది. ఈ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 54.93 లక్షల ఎకరాలు ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా.

నీటి విడుదలకు సన్నాహాలు

రాష్ట్రంలో యాసంగి పంటల సాగుకు నీటిని విడుదల చేసేందుకు రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ సన్నద్ధమవుతున్నది. ఆ శాఖ ప్రతిపాదనలకు ప్రభుత్వ ఆమోదం లభించగానే ప్రాజెక్టులవారీగా నీటి విడుదల తేదీలను ఖరారు చేయనున్నారు. ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో 8 రోజులు ఆన్, 7 రోజులు ఆఫ్ నీటిని విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఆ దిశగా రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు.

వివిధ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు (టీఎంసీల్లో)

ప్రాజెక్టు	నిల్వ సామర్థ్యం	ప్రస్తుత నిల్వ
శ్రీశైలం	215	57
నాగార్జునసాగర్	312	157
శ్రీరాంసాగర్	90	78.66
శ్రీరాజరాజేశ్వర	27.50	23
లోయర్ మానేర్‌డ్యాం	24	19.42
ఎల్లంపల్లి	20	16.03
సింగూరు	29.17	25.81
నిజాంసాగర్	17.80	16.16
కడెం	7.60	4.3
మొత్తం	743.07	397.38

గత సంవత్సరంతో పోల్చితే ప్రాజెక్టుల కింద యాసంగి సాగు తీరిది (ఎకరాల్లో..)

క్యాటగిరీ	2021-22	2022-23	2023-24
తరి పంట	11,95,256	19,81,301	11,57,014
ఆరుతడి	22,32,433	13,84,291	17,38,565
మొత్తం	34,27,689	33,65,592	28.95,579 (215 టీఎంసీలు)

ప్రాజెక్టుల వారీగా ప్రతిపాదిత యాసంగి సాగు విస్తీర్ణం ఎకరాల్లో..

ప్రాజెక్టు	ప్రతిపాదిత సాగు విస్తీర్ణం
భారీ ప్రాజెక్టులు	18,68,883
మధ్యతరహా ప్రాజెక్టులు	2,18,535
మైనర్ ప్రాజెక్టులు	6,72,938
ఐడీసీ	1,35,223
మొత్తం	28,95,579

వివిధ మేజర్ ప్రాజెక్టుల కింద ఈ ఏడాది సాగునీటి శాఖ ప్రతిపాదనలు..

ప్రాజెక్టు	ప్రతిపాదిత సాగు విస్తీర్ణం
ఎస్సారెస్పీ స్టేజీ 1	8,28,297
ఎస్సారెస్పీ స్టేజీ 2	3,26,914
కాళేశ్వరం	93,070
మధ్యమానేరు	54,224
కడెం	0
అలీసాగర్	48,282
గుత్ప	33,725
నిజాంసాగర్	1,24,825
జూరాల	23,346
ఆర్డీఎస్	0
నాగార్జునసాగర్	0
మూసి	30,000
సింగూరు	40,000
దేవాదుల	2,02,400
నెట్టెంపాడు	5,000
కల్వకుర్తి	0
ఏఎమ్మార్పీ, ఎస్ఎల్‌బీసీ	0

నెమ్మదిగా ధాన్యం కొనుగోళ్లు

- **నిరుడు కంటే 13 లక్షల టన్నులు తక్కువే**
- **గతేడాది ఇప్పటివరకు 50 లక్షల టన్నుల కొనుగోలు**
- **ప్రస్తుతం 37 లక్షల టన్నులకే పరిమితం**
- **కొనుగోళ్లలో వేగం పెంచాలంటున్న రైతులు**

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ నెమ్మదిగా సాగుతున్నది. వానకాలం సీజన్‌తో పోల్చితే సుమారు 13 లక్షల టన్నుల ధాన్యం తక్కువ కొనుగోలు చేయడం గమనార్హం. గతంలో ఇప్పటి వరకు సుమారు 50 లక్షల టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ రైతుల నుంచి కొనుగోలు చేయగా, ప్రస్తుతం 37 లక్షల టన్నులకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగం చేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి పెట్టి తమకు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు. ఇక ఈ వానకాలం సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఈ నేపథ్యంలో మొత్తం 99.31 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి వస్తుందని పౌరసరఫరాల సంస్థ అంచనా వేసింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 7,130 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సంస్థ నిర్ణయించింది. ఇందులో 6,416 కేంద్రాలను ప్రారంభించిన పౌరసరఫరాల సంస్థ ఇందులో 5,215 కేంద్రాల్లోనే కొనుగోలు ప్రక్రియను జరుపుతున్నది. అంటే ఇంకా 1,201 కేంద్రాల్లో కొనుగోళ్లు జరగడం లేదు. కొనుగోలు కేంద్రాలు తక్కువగా ఉన్నందున ధాన్యం కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బీఆర్ఎస్ నేతలపై దాడులకు కాంగ్రెస్ యత్నం

- **పోలీసులను ఆశ్రయిస్తున్న గులాబీ పార్టీ శ్రేణులు**
- **తాజా ఘటనలో త్రుటిలో తప్పించుకున్న యుగేంద్రాచారి**
- **ఎస్పీకి మాజీ ఎమ్మెల్యే గండ్ర ఫిర్యాదు**

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): భూపాలపల్లిలో కాంగ్రెస్ నేత గండ్ర సత్యనారాయణరావు ఎమ్మెల్యేగా గెలుపొందడం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారు. టేకుమట్ల మండలం సోమనపల్లి సర్పంచ్ ఉదమారి మహేశ్‌పై కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేసి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని బీఆర్ఎస్ నేతలు పేర్కొంటున్నారు. చిట్యాల మండలం కైలాపూర్‌లో సైతం ఇలాంటి ఘటనే జరగ్గా పోలీసులు ఇరు వర్గాలపై కేసులు పెట్టి జైలుకు పంపారు. తాజాగా బుధవారం రాత్రి భూపాలపల్లిలో బీఆర్ఎస్ నాయకుడిపై కాంగ్రెస్ నాయకులు దాడికి యత్నించారు. బీఆర్ఎస్ నాయకుడు పూసాల యుగేంద్రాచారి దాడి నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. కాంగ్రెస్ నాయకుల దాడులను అరికట్టాలని చిట్యాల, టేకుమట్లలో జరిగిన ఘటనలను, యుగేంద్రాచారిపై దాడి ఘటనను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గురువారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏపీలోని అస్పరిలో బంగారు గనుల గుర్తింపు

హైదరాబాద్, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ): ఏపీలోని కర్నూలు జిల్లా అస్పరి మండలంలో బంగారు గనులు ఉన్నాయని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ప్రాథమికంగా నిర్ధారించింది. అక్కడ లభ్యమయ్యే బంగారు ఖనిజ నిల్వల పరిమాణం, నాణ్యత, ఎంత విస్తీర్ణంలో ఉన్నాయనే అంశాలను నిర్ధారించడానికి వీలుగా సమగ్ర సర్వే చేపట్టాలని జీఎస్ఐ అధికారులు నిర్ణయించారు. ఇటీవలే తుగ్గలి మండలంలో బంగారు గనులున్నట్టు గుర్తించిన అధికారులు తవ్వకాలు చేపడుతున్నారు. అస్పరి మండలంలో తవ్వకాలు చేయడం లాభదాయకమా, కాదా? అన్న విషయం తేలాల్సి ఉన్నదని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సర్వేను మాత్రమే పూర్తి చేయాలని జీఎస్ఐ భావిస్తున్నది. తాడిపత్రికి 12కి.మీ. దూరంలో గ్యాస్ నిక్షేపాల పరిమాణంపై అంచనా వేసేందుకు ఓఎన్జీసీ కూడా సర్వే చేపట్టనున్నది

20న పోచంపల్లికి రాష్ట్రపతి ముర్ము

- **ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు**

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 14 : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 20న యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో పర్యటించనున్నారు. ఇందుకోసం జిల్లా అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం కలెక్టర్ హనుమంతు కే జెండగే, హ్యాండ్లూమ్ కమిషనర్ అలుగు వర్షిణి, వీవర్స్ సర్వీస్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్‌కుమార్ తదితరులు భూదాన్ పోచంపల్లిలోని బాలాజీ ఫంక్షన్‌హాల్‌ను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీ రంజన్ సిల్క్ యూనిట్‌ను సందర్శించి సిల్క్ యారన్ తయారీ, చేనేత మగ్గాలు, వస్త్రాల తయారీ విధానం, రంగుల అద్దకం ప్రక్రియను,హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు.

కామారెడ్డి జిల్లా సరిహద్దులో వాహనం ఢీకొనడంతో మృత్యువాతపడిన చిరుత

వాహనం ఢీకొని చిరుత మృత్యువాత

సదాశివనగర్, డిసెంబర్ 14 : వాహనం ఢీకొనడంతో చిరుత మృత్యువాతపడిన ఘటన గురువారం రాత్రి కామారెడ్డి జిల్లా సరిహద్దులో చోటుచేసుకున్నది. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని దగ్గి, నిజామాబాద్ జిల్లా చంద్రయాన్‌పల్లి గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి చిరుత రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. దీంతో రోడ్డుపై వెళ్తున్న వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న కామారెడ్డి అటవీ శాఖ రేంజ్ అధికారి రమేశ్ ఆధ్వర్యంలో కల్వరాల్ సెక్షన్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని చిరుత కళేబరాన్ని పంచనామా నిమిత్తం కామారెడ్డికి తరలించారు.

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న దీపికా పదుకొణె

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): శ్రీవారి దర్శనార్థం ప్రముఖ బాలీవుడ్ నటి దీపికా పదుకొణె గురువారం తిరుమలకు చేరుకొన్నారు. అలిపిరి మెట్లమార్గంలో ఆమె కొండపైకి వెళ్లారు. రాత్రి తిరుమలలోనే బస చేసి శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆమె శ్రీవారిని దర్శించుకోనున్నారు.

విశాఖ ఇండస్ దవాఖానలో అగ్నిప్రమాదం

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : విశాఖ జగదాంబ కూడలి సమీపంలోని ఇండస్ దవాఖానలో అగ్నిప్రమాదం సంభవించింది. దవాఖాన మొదటి అంతస్థు ఆపరేషన్ థియేటర్‌లో మంటలు చెలరేగి, ఆ తర్వాత మిగిలిన అంతస్థులకు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు 40 మంది రోగులను అంబులెన్స్‌లలో వివిధ దవాఖానలకు తరలించారు. ఈ ప్రమాదంతో రోగులు, వారి బంధువులు భయభ్రాంతులకు గురయ్యారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్టు విశాఖ సీపీ రవిశంకర్ తెలిపారు.

సైకిల్ యాత్ర చేపట్టిన వారికి మరికల్‌లో స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు

అయోధ్య నుంచి శ్రీలంకకు సైకిల్ యాత్ర

- **మరికల్‌లో స్వాగతం పలికిన బీఆర్ఎస్ నాయకులు**

మరికల్, డిసెంబర్ 14 : మహారాష్ట్రకు చెందిన మాజీ సైనికులు డాక్టర్ సాహెబ్‌రావు, శివనారాయణ్ మిశ్రాకార్నర్, కులకర్నే సుభేదర్ అయోధ్య నుంచి శ్రీలంకకు సైకిల్ యాత్ర చేపట్టారు. గురువారం వారు నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రానికి చేరుకోగా.. బీఆర్ఎస్ నాయకులు, విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యాత్ర చేస్తున్న వారు మాట్లాడుతూ.. నిత్యం 100 నుంచి 150 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర కొనసాగిస్తున్నట్టు తెలిపారు. గత నెల 24న యాత్ర ప్రారంభించామని, శ్రీలంకకు చేరుకున్న తరువాత అక్కడే 18 రోజులపాటు బస చేసి తిరిగి అయోధ్య చేరుకుంటామని చెప్పారు. యాత్రలో భాగంగా ప్రాచీన కట్టడాలు, పలు ప్రాంతాలను సందర్శిస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

గురువారం మిల్లులో రికార్డులను పరిశీలిస్తున్న ఐటీ అధికారులు

మిర్యాలగూడ రైస్ మిల్లుల్లో ఐటీ సోదాలు

మిర్యాలగూడ, డిసెంబర్ 14: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని పలు రైస్ మిల్లుల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు గురువారం మరోమారు తనిఖీలు నిర్వహించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో (నవంబర్ 16న) మిర్యాలగూడలోని పలు రైస్ మిల్లుల్లో ఐటీ అధికారులు సోదాలు చేశారు. శెట్టిపాలెం, సాగర్ రోడ్డులోని మిల్లులతోపాటు ముగ్గురు బియ్యం వ్యాపారుల ఇండ్లల్లోనూ మూడు రోజులపాటు తనిఖీలు చేపట్టి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. నెల రోజుల తర్వాత గురువారం రెండోసారి రైస్ మిల్లులపై దాడులు నిర్వహించారు. మిర్యాలగూడలోని సాయి జయలక్ష్మి, సాంబశివ, వైష్ణవి, సూర్య, ఆర్ఎస్‌వీ మిల్లుల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సారి వ్యాపారుల నివాసాల్లో కాకుండా నేరుగా మిల్లులోకి వెళ్లి దాడులు చేస్తున్నారు. ఆరు బృందాలుగా వచ్చిన ఐటీ అధికారులు.. మిల్లుల్లోని రికార్డులతోపాటు బ్యాంకు లావాదేవీలు, కొనుగోలు రికార్డులను సైతం పరిశీలిస్తున్నారు.

ఏపీలో పదోతరగతి, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. సాధారణ ఎన్నికల నేపథ్యంలో మార్చిలోనే పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్, 18 నుంచి పదో తరగతి పరీక్షలు కొనసాగుతాయని వెల్లడించారు. రాష్ట్రంలో 6 లక్షల మంది ఎస్సెస్సీ, 10 లక్షల మంది ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతాయని చెప్పారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 5 నుంచి 25 వరకు నిర్వహించనున్నామని వెల్లడించారు.

ఏపీలో 40.76 లక్షల బోగస్ ఓట్లు

- **వాటిని టీడీపీ నేతలే చేర్పించారు**
- **వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి**
- **కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు**

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఏపీలో టీడీపీ నేతలు 40,76,580 బోగస్ ఓట్లను చేర్పించారని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన నేతృత్వంలోని ఆ పార్టీ ఎంపీల బృందం ఢిల్లీలోని సెంట్రల్ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఒకే ఫొటోతో ఇంటి పేరు మార్చి పలు ప్రాంతాల్లో ఓటర్లను నమోదు చేసినట్టు ఆరోపించారు. హైదరాబాద్, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో నివసిస్తున్న టీడీపీ సానుభూతిపరుల ఓట్లను ఏపీలో నమోదు చేయించారని తెలిపారు. టీడీపీ ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని ఉల్లంఘిస్తూ 'మై పార్టీ డాష్ బోర్డ్' యాప్ ద్వారా ప్రజల కుల, మత, వ్యక్తిగత వివరాలను సేకరిస్తుందని తెలిపారు. ఈ డాటాను అమెరికా న్యూయార్క్ నగరంలోని సర్వర్‌లో భద్రపరుస్తున్నారని చెప్పారు. ఒక వ్యక్తి కులాన్ని తెలుసుకోవడం ద్వారా పోలరైజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారని, మోడల్ కోడ్ ఉల్లంఘించేలా అనేక అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించేందుకు ఫారం-7 దరఖాస్తులను బీఎల్‌వోలకు టీడీపీ నేతలు సమర్పిస్తున్నారని, ఓటర్ వెరిఫికేషన్ పేరుతో ప్రతి 30 ఇండ్లకు ఒక టీడీపీ కార్యకర్తను నియమిస్తున్నారంటూ వివరించారు. ఈ వ్యవహారంపై విచారించి బోగస్ ఓట్లను తొలగించాలని కోరారు.

పంట పొలాలపై కృష్ణ జింకల దాడి

నారాయణపేట జిల్లా మక్తల్, మాగనూరు, కృష్ణా మండలాల్లో కృష్ణ జింకల సంతతి భారీగా పెరిగింది. నదీ తీర ప్రాంతం కావడంతో ఒక్కో గుంపులో వంద నుంచి 150 జింకలు వచ్చి పంట పొలాలపై దాడి చేస్తున్నాయి. దీంతో రైతన్నలు బెంబేలెత్తుతున్నారు. కంటిమీద కునుకులేకుండా రాత్రింబవళ్లు పొలాల గట్లపై నిద్రిస్తూ పంటలను కాపాడుకుంటున్నారు. జింకల బారి నుంచి పంటలను కాపాడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

- మహబూబ్‌నగర్ ఫొటోగ్రాఫర్